క్లుప్తంగా

అయ్యప్ప గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో గురుస్వాములు, మాలధారుల ఆధ్వర్యంలో గురువారం అయ్యప్ప స్వామి మండల పూజతో పాటు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు పుష్పాలంకరణ చేసి గణపతి హోమం, అభిషేకాలు చేశారు. గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో వేర్వేరుగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అయ్యప్ప మాలాధారులు డప్పులు కొడుతూ నృత్యం చేశారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణలతో పట్టణం మార్మోగింది.

బొకేలు వద్దు.. మొక్కలు ముద్దు'



డీఆర్‌ఎంకు మొక్క అందజేస్తున్న జేవీవీ నాయకులు

గుంతకల్లు: నూతన సంవత్సరానికి బొకేలు, గ్రీటింగ్‌లకు బదులు మొక్కలు అందజేసి శుభాంకాక్షలు తెలియజేయాలని వక్తలు విజ్ఞప్తి చేశారు. గురువారం జన విజ్ఞాన వేదిక, స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు డీఆర్‌ఎం విజయ్‌కుమార్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఆర్డీఓ పరిపాలన అధికారి వై.భూషణం, ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి తదితరులకు మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాంకాక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకుడు హరిప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిబాబు, లింగమూర్తి, దివ్యాంగుల సంఘం నాయకుడు రాహుల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం సీడీపీఓ ఢిల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అన్ని రకాల రికార్డులు పరిశీలించారు. పిల్లలు, బాలింతలు, గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: పట్టణంలోని ఐసీడీఎస్, జన శిక్షణ్ సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో 105 రోజుల పాటు నిర్వహించిన బ్యూటీషియన్ కోర్సు గురువారం పూర్తి అయింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కార్యాలయంలో బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన 20 మంది యువతులకు సీడీపీఓ ఢిల్లీశ్వరి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. సర్టిఫికెట్లు పొందిన వారికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అంతే కాకుండా బ్యాంకుల్లో రుణాలు తీసుకోచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, బ్యూటీషియన్ మాస్టర్ రాగిణి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో 'వీర్ బాల్ దివస్'

తాడిపత్రి అర్బన్: సిక్కుల 10వ గురువు గురు గోవింద్ సింగ్‌జీ సాహిబ్జాదే అయిన బాబా ఫతేసింగ్, జోరావర్ సింగ్‌ల బలిదానం జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న వీర్ బాల్ దివస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వైష్ణవి పాఠశాలలో బీజేపీ కర్నూలు జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గోవింద్ జీ కుమారుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్, చేనేత జిల్లా కన్వీనర్ నారాయణస్వామి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాల కంబగిరి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు ఎస్‌ఐగా రామిరెడ్డి



యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామిరెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీరాంప్రసాద్‌ను జిల్లా ఎస్పీ జగదీష్ వీఆర్‌కు పంపించారు. వీఆర్‌లో ఉన్న రామిరెడ్డిని యల్లనూరు రెగ్యులర్ ఎస్‌ఐగా నియమించారు. రామిరెడ్డి గతంలో బనగానపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుండేవారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ప్రత్యేక నిఘా పెడుతామన్నారు.

పప్పుశనగకు బూజు, పచ్చ తెగులు



బూజు తెగులు సోకడంతో నల్లగా మారిన పప్పుశనగ కాయలు

- ఆకాశం మేఘావృతవడంతో తెగుళ్ల విజృంభణ
- కాయలు నల్లగా మారి ఎండిపోతున్న వెనం

తాడిపత్రి రూరల్: తరచూ అల్పపీడనాల నేపథ్యంలో ఆకాశం మేఘావృతం అవుతోంది. అప్పడప్పుడు మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఈ ప్రభావం పప్పుశనగ పంటపై తీవ్రంగా చూపుతోంది. ఎక్కువగా బూజు తెగులు, పచ్చతెగులు ఆశిస్తోంది. ఖరీఫ్‌లో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడానికి రబీలో పప్పుశనగపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తాడిపత్రి ప్రాంతంలోని తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ఎక్కువ శాతం మంది రైతులు పప్పుశనగ పంట సాగు చేశారు. అడపా, దడపా కురుస్తున్న అరకొర వర్షాలు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల మొలక ప్రారంభం దశలో ఎండుతెగులు వల్ల పంట ఎదుగుదల లేకపోయింది. మొలక దశలో పంట దెబ్బతి



పచ్చ తెగులు సోకిన పప్పుశనగ పంట

నింది. అలాగేన తెగుళ్ల నియంత్రణ కోసం రైతులు పురుగుల మందులు పిచికారీ చేశారు. వేలకు వేలు ఖర్చు చేసి ఎరువులను విత్తారు.

పప్పుశనగకు తెగుళ్లు

పూత దశలో కొన్ని చోట్ల, పిండె దశలో మరి కొన్ని ప్రాంతాల్లో పప్పుశనగ ఉంది. మరో 20 నుంచి 30 రోజుల్లో పంట చేతికి రానుంది. ఇలాంటి పరిస్థితుల్లో పప్పుశనగకు బూజు తెగులు, పచ్చ తెగులు వ్యాపించింది. బూజు తెగులు వల్ల పిండెలతో ఉన్న చెట్లు నల్లగా మారుతున్నాయి. కొన్ని రోజులకు చనిపోతున్నాయి. ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు తెగులు వ్యాపిస్తూ పంటను నాశనం చేస్తోంది. చేతికి వచ్చిన పంటకు పచ్చ తెగులు వ్యాపించింది. తెగుళ్ల కారణంగా చెట్ల ఆకులు పసుపు పచ్చగా మారుతున్నాయి. దంతో దిగుబడిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కారిపోతున్న పులుసు

అల్పపీడనం వల్ల కురుస్తున్న మోస్తరు వర్షాలకు పప్పుశనగ చెట్లకు ఉన్న పులుసు కారిపోతోంది. పులుసు కారిపోవడం వల్ల పిండెలు అభివృద్ధి కావడం లేదు. పులుసు ప్రభావం వల్ల పంట దిగుబడి తగ్గనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా పంట సాగు చేసిన చోట్ల చెట్లు పూత, పిండె దశలో ఉన్నాయి. తరుచూ మారుతున్న వాతావరణం కారణంగా పూత రాలిపోతోంది. దీంతో చెట్లకు పిండెలు పడటం లేదు. చేతికి వచ్చిన పంటకు అల్ప పీడనం రూపంలో ఎక్కడ దక్కకుండా పోతుందోనన్న భయం అన్నదాతలో నెలకొంది.

పూత రాలిపోయింది



పిండె దశలో ఉన్న పంటకు వర్షాలు పడితే దెబ్బతింటుంది. చెట్లకు ఉన్న పులుసు కారణంగా కాయలు వృద్ధి చెందుతాయి. వర్షాల వల్ల పూత రాలిపోయింది. పులుసు కూడా కారిపోతే ఆశించిన దిగుబడి రాదు. పంటకు సోకిన బూజు తెగులును ఎలా నివారించాలో తెలియక ఇబ్బంది పడుతున్నాం.

– నారాయణరెడ్డి, కొనగుంటపల్లి

తెగుళ్లపై జాగ్రత్తగా ఉండాలి



అల్పపీడనం కారణంగా పంట దెబ్బతినకుండా ఉండేందుకు రైతులు ముందు జగ్రత్తలు తీసుకోవాలి. పచ్చ, బూజు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు వ్యవసాయాధికారులను రైతులు సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలి. ఇష్టానుసారం మందులను పిచికారీ చేయకూడదు.

– చెంగలరాయుడు, ఏడీఏ

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

శింగనమల: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి , వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం గురువారం నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలో నిర్వహిస్తామని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు కోరారు. శింగనమలలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వద్ద నుంచి ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు వెళ్లి, అధికారులకు వినతి పత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

గుంతకల్లుటౌన్: ప్రజలపై చంద్రబాబు కరెంట్ చార్జీల బాదుడును నిరసిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక టీవీ స్టేషన్ వద్ద వైఎస్సార్ విగ్రహం నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి ట్రాన్స్‌కో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని ఆమె కోరారు.

పామిడి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గుంతకల్లులో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే విద్యుత్ బిల్లుల పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణ రెడ్డి కోరారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు పెద్దఎత్తున కదలి రావాలన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



గుంతకల్లులో వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం కార్మికులు గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 1వ తేదీ వేతనాలివ్వాలని, రెగ్యులర్ కార్మికులకు బకాయిపడిన సరెండర్ లీవ్‌లు అమలు చేసి, జీపీఎఫ్ అకౌంట్‌ను ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు జగదీష్, నాయకులు దాసు, కొండయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గత ప్రభుత్వం జారీ చేసిన జీవోలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గుత్తిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల (కార్మికులు) యూనియన్ నాయకులు రామాంజి, మహేష్, కార్మిక సంఘం నాయకులు సూరి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ప్రచార జాతా ప్రారంభం



జెండాను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లు: యూటీఎఫ్ ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో నిర్వహించే స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వర రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, కోశాధికారి రాఘవేంద్ర కోరారు. గురువారం పట్టణంలోని భగత్‌సింగ్ పుర పాలక ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమాల ఫలితంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు పలు ప్రయోజనాలు చేకూరాయని గుర్తు చేశారు. అనంతరం జీపు జాతా ప్రారంభించారు. జీపు జాతా ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, అనంతపురం, రాప్తాడు మీదుగా సత్యసాయి జిల్లాకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిమ్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా నాయకులు రామప్పచౌదరి, సరళ, శేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ రాజ్‌కుమార్, నాయకులు కల్పన, గిరిబాబు, మురళి, శంకరయ్య, రమేష్, ఎల్లన్న, రామెహ్మన్, చిన్న రంగన్న, విశ్వేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయల చెరువులో మట్టి దందా అరికట్టండి



తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

యాడికి: రాయలచెరువులో మట్టి రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదని ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాసా చంద్రమోహన్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ రంగయ్యతో పాటు పరిమి చరణ్, లక్షుంపల్లి రవికుమార్ మండలంలోని రాయలచెరువులో ఉన్న చెరువు మట్టిని ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకోకుండా హిటాచీలు, టిప్పర్లతో రవాణా చేస్తూ రూ.లక్షలు దోచుకుంటున్నారన్నారు అక్రమంగా చెరువు మట్టి తరలించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటనాయుడు, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర, శ్రీధర్, శ్రీరాములు, నాయకులు కోట చౌదరి పాల్గొన్నారు.

వైభవంగా అక్కమహాదేవతల గ్రామోత్సవం



అక్కమహాదేవతల ఊరేగింపు దృశ్యం



కలశాలు తీసుకెళ్తున్న మహిళలు

తాడిపత్రి అర్బన్: పుట్లూరు రోడ్డులోని అక్కమహాదేవతల ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తుల సమక్షంలో విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా అక్కమహాదేవతల జీవిత చరిత్రను హరికథా రూపంలో ప్రదర్శించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను అలంకరించి పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

108 మంది మహిళలు కలశాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. ఈ సందర్భంగా కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఏకాదశి పూజలు



పామిడి: పట్టణంలోని తగ్గ దేవాలయంలో గురువారం ధనుర్మాస ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుడు విశ్వనాథశర్మ సారథ్యంలో విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ, వివిధ పారాయణాలు పఠించారు. దేవతామూర్తులను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది.

'ఎద్దుల బండిని తొలగించండి'

యాడికి: రహదారిలో అడ్డంగా ఉంచిన ఎద్దుల బండి వల్ల ట్రాక్టర్ బయటకు తీసుకురావటం ఇబ్బందిగా ఉందని, వెంటనే ఎద్దుల బండిని తొలగించాలని మండలంలోని తూట్రాళ్లపల్లికి చెందిన వెకటనాగిరెడ్డి గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మా ఇంటి ఎదురుగా ఉన్న ఆదిరెడ్డి, లక్ష్మిరెడ్డి ఇంటి బయట రాళ్లు, ఎద్దులబండి ఉంచారన్నారు. గత వారం క్రితం కోర్టు ఆదేశాల మేరకు అడ్డుగా ఉన్న రాళ్లు, ఎద్దుల బండిని ఎంపీడీఓ వీరరాజు, ఎస్‌ఐ రమణ తొలగించారు. కానీ వారు కోర్టు ఆదేశాలను ధిక్కరించి మళ్లీ రాళ్లు, ఎద్దుల బండి అలాగే ఉంచారన్నారు. నాతో పాటు ప్రజల అవసరాలను గుర్తుంచుకుని రహదారిలో ఉన్న ఎద్దులబండిని తొలగించాలని వారు ఎంపీడీఓను కోరారు.

ఘనంగా సీపీఐ శత వసంతోత్సవం



గుంతకల్లులో జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



తాడిపత్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు/గుంతకల్లురూరల్/బుక్కరాయసముద్రం/పెద్దవడుగూరు/తాడిపత్రి/పామిడి: కమ్యూనిస్టు పార్టీ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వసంతోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా గుంతకల్లులోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్ పతాక ఆవిష్కరణ చేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసి పార్టీ సీపీఐ మాత్రమేనన్నారు. కార్యక్ర మంలో సీపీఐ నాయకులు ఎస్‌ఎండీ గౌస్, రామాంజినేయులు, ఈశ్వరయ్య, మల్లయ్య, కుళ్లాయప్ప, మురళీకృష్ణ, వినోద్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వైటీ చెరువు గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రాము రాయల్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్, మండల కమిటీ నాయకు లు గురుస్వామి ఇతర నాయకులు పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు రామక్రిష్ణ, హరిక్రిష్ణ, శ్రీనివాసులు, తిరుపతయ్య, రామాంజనేయులు, నాగేంద్ర, మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరులో నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, నాయకులు నారాయణ, లింగన్న ఉసేన్‌పీరా, రంగస్వామి, శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్, క్రిష్టిపాడు ఆది నారాయణ, నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, శ్రీరాములు, అల్లాబకాస్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తాడిపత్రిలోని పుట్లూరు రోడ్డు నుంచి గాంధీ కట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజారెడ్డి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, సహాయ కార్యదర్శి శ్రీరాములు, సీపీఐ నాయకులు నాగేంద్ర, రామాంజి, సూరి, రమణ, రత్నమయ్య, అబ్రహం, నాయక్, రామకృష్ణ, సంజన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పామిడిలో నిర్వహించిన సీపీఐ ఆవిర్భావ దినోత్సవంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కే రహీమ్, పామిడి, గార్లదిన్నె, పెద్ద వడుగూరు మండలాలకు చెందిన నాయకులు నారాయణస్వామి, పెద్ద చౌడప్ప, ఓంకారు, సూర్యనారాయణ రెడ్డి, నాగయ్య, బాలయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలసిన ఆలూరు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి పులివెందులలో కలిశారు. నియోజకవర్గంలో నిర్వహించే వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం గురించి వివరించినట్లు సాంబశివారెడ్డి తెలిపారు.

పంచలోహ విగ్రహాలకు చర ప్రతిష్ట



అలంకరణలో అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి

పామిడి: మండలంలోని ఓబుళాపురం గుట్టపై వెలసిన దొడ్డ ఓబులేసుస్వామి (లక్ష్మీ నరసింహస్వామి) పంచలోహ విగ్రహాలకు గురువారం చర ప్రతిష్ట నిర్వహించారు. వేదపండితుడు తోటపల్లి సూర్యనారాయణస్వామి బృందం సారథ్యంలో మంత్రోచ్చారణల నడుమ దేవతామూర్తుల పంచలోహ విగ్రహాలకు చర ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా చేశారు. విగ్రహాలను గుంతకల్లు మండలం అయ్యవారిపల్లి దామోదర్‌రెడ్డి తయారు చేయించి, ఆలయానికి వితరణ చేశారు. అనంతరం ఆలయ పెద్దలు ఓబులేసు, ఓబిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పంచలోహ దేవతామూర్తుల విగ్రహాలకు కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

'శివాలయం గదికి ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలి'

గుత్తి: పట్టణంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలోని గదిని ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు వేణు, సుధాకర్, రమణ తదితరులు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియాకు వినతిపత్రం అందజేశారు. గురువారం వారు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్‌కు విన్నవించారు. భక్తుల కానుకలతో ఆలయంలో పూజలు చేస్తున్నామన్నారు. గదిని తక్కువ అద్దెకు ఇచ్చామని, ఆ డబ్బుతో దీప దూప నైవేద్యం పెడుతున్నామన్నారు. పూజారులకు జీతాలు కూడా లేవన్నారు. భక్తులు ఇచ్చే కానుకలే వారికి జీతాలన్నారు. ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు అభ్యర్థించారు. అందుకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

వైభవంగా శ్రీచక్ర పతిష్ట



తాడిపత్రి అర్బన్: కడప రోడ్డులోని భగళాముఖి అమ్మవారి ఆలయంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు సమీపంలోని ముక్కామల పీఠాధిపతి శ్రీధర్ గురూజి ఆధ్వర్యంలో గురువారం శ్రీచక్ర ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భగళాముఖి మేరు శ్రీచక్ర యంత్ర ప్రతిష్ట, త్రిశూలం, భగళాముఖి అమ్మవారి పంచలోహాల విగ్రహన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, నవగ్ర కళశస్థాపన, పుణ్యాహవాచనం, గణపతి పూజ, భగళాముఖి హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

జీవనోపాధులకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో ఆసక్తి ఉన్న వారు జీవనోపాధుల (సర్వీస్ ప్రొవైడర్లు, బ్యూటీషియన్) కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మెప్మా ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27, 28 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు: మండలకేంద్రం సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు. ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న సంపంగి నాగేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.